క్లుప్తంగా

నేడు కంటివెలుగు సన్నాహక సమావేశం

చారకొండ: మండల కేంద్రంలోని రైతువేదికలో కంటి వెలుగుపై గురువారం సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జయసుధ తెలిపారు. సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కల్వకుర్తిరూరల్: మండలంలోని లింగసానిపల్లి చెందిన మల్లయ్యకు మంజూరైన రూ.40వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం ఎంపీటీసీ భరత్ ప్రసాద్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

15న బండలాగుడు పోటీలు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని 15వ తేదీన బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగ బుధవారం రైతు సంబరాల పోస్టర్లను విడుదల చేశారు. మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ.40వేలు, మూడో బహుమతి రూ.30వేలు, 4వ బహుమతి రూ.20వేలు, 5వ బహుమతి రూ.10వేలు ఉంటాయని పేర్కొన్నారు.

నేడు ముగ్గుల పోటీలు

చారకొండ: సంక్రాంతి సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్‌సర్కిల్ వద్ద బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ నిర్మలా తెలిపారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజేతలకు జీబీఆర్ ట్రస్టు చైర్‌పర్సన్ గువ్వల అమల హాజరై బహుమతులు అందిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో యాదమ్మ, ఉపసర్పంచ్ రాణి, అరుణ, నాయకులు ఉన్నారు.

నర్సరీల పరిశీలన

తాడూరు: మండలంలోని గోవిందాయిపల్లిలో హరితహారంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీని బుధవారం ఎంపీఓ లక్ష్మణ్‌నాయక్ పరిశీలించారు. గ్రామ జనాభా, ప్రభుత్వ స్థలాలను దృష్టిలో ఉంచుకొని డీఆర్‌డీఓ అధికారులు ఇచ్చిన నిబంధనల మేరకు విత్తనాలను కవర్లలో విత్తాలన్నారు. సర్పంచ్ రామలక్ష్మమ్మ పంచాయతీ సిబ్బందికి నర్సరీ నిర్వహణపై అవగాహన కల్పించారు.

నేడు కబడ్డీ పోటీలు

కోడేరు: మండలంలోని గుండ్యావాల్యానాయక్ తండాలో గురువారం నుంచి 15వ తేదీ వరకు కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు యుగేందర్, మంగిలాల్, సంతోష్, దివాకర్ తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పోటీలు ఉంటాయని గిరిజనులు మాత్రమే పాల్గొనాలని కోరారు. వివరాలకు 9347262852, 9392188746 సంప్రదించాలని కోరారు.

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి

కొల్లాపూర్: యుద్ధవీరుడు వడ్డే ఓబన్న జయంతిని పట్టణంలో వడ్డెర కులస్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, కురుమూర్తి, వెంకటస్వామి, బీసన్న, సత్యం, రాము, శివుడు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్‌పై అవగాహన

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండల కేంద్రంలోని బియ్యం మిల్లు వద్ద కమ్యూనిటీ పోలీసింగ్ విధానంపై పోలీసులు బుధవారం అవగాహన కల్పించారు. తక్షణ సాయంకోసం డయల్ 100, నిఘా కోసం సీసీ కెమెరాల ఏర్పాటు ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో బాలస్వామి, పద్మ పాల్గొన్నారు.

లాల్‌బహదూర్ శాస్త్రికి ఘన నివాళి

కొల్లాపూర్: దివంగత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకుడు జగదీశ్వరుడు అన్నారు. వర్ధంతి సందర్భంగా బుధవారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మధుసూదనరావు, మొయిది నవాజ్, జలీల్ అహ్మద్ ఖాన్, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వెల్దండ: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. వంగూర్ మండలం పోల్కంపల్లి చెందిన బాల్‌నర్సింహ ఎలాంటి అనుమతి లేకుండా వెల్దండ మండలం పోతేపల్లికి ట్రాక్టర్‌తో ఇసుకను తరలిస్తున్నారు. విధుల్లో ఉన్న కానిస్టేబుల్ ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకొని పరిశీలించగా అనుమతులు లేనట్లు గుర్తించారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్ తరలించి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చలి తీవ్రతతో వరికి నష్టం

• క్షేత్రస్థాయిలో పంట సాగు వివరాల నమోదు



మన్ననూరులో జిప్సం ఎరువు చల్లుతున్న రైతు



అవుసలికుంట శివారులో వరినారు మడిని పరిశీలిస్తున్న ఏఓ, ఏఈఓ

లింగాల: యాసంగిలో సాగు చేసిన వరి పంటకు చలి తీవ్రత ప్రభావం అధికంగా ఉంటుందని, దీంతో పంటకు నష్టం కలుగుతుందని మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి రైతులకు సూచించారు. మండలంలోని అవుసలికుంట శివారులో యాసంగిలో సాగు చేసిన వరి పంటను బుధవారం ఏఓ, ఏఈఓ పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 350 ఎకరాలలో మాత్రమే వరి సాగు చేశారని తెలిపారు. చలి తీవ్రత వలన వరినారు ఎర్రగా మారుతుందని తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. నారుమడిని 10 నుంచి 12 రోజుల వ్యవధిలో 3 దఫాలుగా దమ్ము చేసి చదును చేయాలని, నీరు పెట్టుటకు, తీయుటకు తగు కాల్వలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జింకు లోపాన్ని గమనించి లీటరు నీటికి ఒక గ్రామ్ జింక్ సల్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. చలి ఎక్కువగా ఉండే దాళ్వా వరి సాగులో జింక్‌లోప లక్షణాలు స్పష్టంగా కనపిస్తాయని, విత్తిన 10 రోజులకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 160 గ్రాముల చొప్పున వేయాలన్నారు. లేకుంటే మోనోక్రోటోపాస్ 1.6 మి.లీ. లేదా క్లోరిఫైరిఫాస్ 2 మి.లీ.ను లీటరు నీటికి కలిపి విత్తిన 10 రోజులకు, లేదా 17 రోజులకు పిచికారి చేయాన్నారు. లేదంటే నారు తీయడానికి 7 రోజుల ముందు సెంటు నారుమడికి 160 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలను ఇసుకలో కలిపి పలుచగా నీరు ఉంచి వేయాలన్నారు.

క్షేత్రస్థాయిలో పంటల నమోదు

మండలంలోని ఆయా గ్రామాలలో సాగు చేసిన పంటలను వ్యవసాయశాఖ వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేశారు. ఏఏ సర్వే నంబర్‌లో ఎంత విస్తీర్ణంలో పంటలను సాగు చేశారనే వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఏఓ తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసే ముందు ఆన్‌లైన్‌లో నమోదు అయిన పంటలను మాత్రమే ప్రభుత్వ కొనుగోలు చేస్తుందని ఏఓ తెలిపారు. రైతులు సాగు సమాచారాన్ని వ్యవసాయ శాఖ అందజేయాలని సూచించారు.

జిప్సం ఎరువుతో ఉపయోగం

మన్ననూర్: వేరుశనగ పంటలో జిప్సం ఎరువులు వేసుకోవడంతో కలిగే లాభాల గురించి ఏఈఓ సీతారాం తుర్కపల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. జిప్సం ఎరువులో 28 శాతం క్యాల్షియం, 18 శాతం సల్ఫర్ పోషకాలు తగిన మోతాదులో ఉంటాయన్నారు. వేరుశనగ కాయలు గట్టిపడే అవకాశంతో పాటు వీటిలో లొట్టలు రాకపోగా(తాలు) నూనె శాతం పెరుగుతుందన్నారు. దీంతో రైతులు మార్కెట్‌లో అమ్ముకునే సమయంలో కాయలు అధిక బరువు వస్తుండటంతో లాభాలు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. వేరుశనగ సాగు చేస్తున్న రైతులు ఎకరాకు 200 కేజీల జిప్సం తప్పకుండా వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు విజయ్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు, శివకుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పాదయాత్ర

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మాచినేనిపల్లి, అంకిరావుపల్లి, కుడికిల్లలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు చేస్తున్న పాదయాత్ర బుధవారం కొనసాగింది. ప్రజలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన గ్రామాలలో మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇస్తే కొల్లాపూర్‌ను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

అచ్చంపేట రూరల్: విద్యార్థి మృతికి కారణమైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డీఓ కార్యాలయంలోని నాయబ్ తహసీల్దార్ రాములుకు వినతిపత్రం అందజేశారు. పదో తరగతి విద్యార్థి ఆకాష్ పాఠశాలకు ఆలస్యంగా వచ్చాడనే కారణంతో వరండాలో నిలబెట్టడం, మందలించడంతోనే మనస్తాపనికి గురై ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. స్కూల్ యాజమాన్యం విద్యార్థి కుటుంబానికి రూ. 25లక్షల ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనిల్, అన్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సర్పంచ్‌ల భిక్షాటన



పండ్ల వ్యాపారి వద్ద భిక్షాటన చేస్తున్న సర్పంచ్‌లు

అచ్చంపేట రూరల్: పంచాయతీలకు కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులను తమకు తెలియకుండానే ప్రభుత్వం పక్కదారి పట్టించిందని ఆరోపిస్తూ బుధవారం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ సర్పంచ్‌లు పట్టణంలో భిక్షాటన చేశారు. పలువురు సర్పంచులు మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్పంచులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారన్నారు. నిధుల లేమి సమస్యలతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక చాలా మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు. పంచాయతీలకు వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఛత్రునాయక్, సరిత, ఊర్మిల, సుజాత, మయూరి, నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం



ఉప్పునుంతలలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రభుత్వవిప్ గువ్వల బాలరాజు

ఉప్పునుంతల: క్రీడలతో యువతలో విజయం సాధించాలనే పట్టుదల వృద్ధి చెందడంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ప్రభుత్వవిప్ గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం మండల పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలను డీఎస్పీ కృష్ణకిశోర్‌తో కలిసి ప్రభుత్వవిప్ ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి కొంత సేపు వాలీబాల్ ఆడారు. రెండు రోజుల పాటు నిర్వహించే పోటీలలో 12జట్లు పాల్గొంటున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు.

చెక్కుల పంపిణీ

వంగూర్: మండలంలోని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు బుధవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆర్డీఓ రాజేష్‌కుమార్‌తో కలిసి పంపిణీ చేశారు. ఆడబిడ్డలకు అండగా ఉండేందుకు ప్రభుత్వం పలు రకాల అభివృద్ధి పనులను చేపడుతుందని అన్నారు. ఎంపీపీ భీమమ్మ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు హమీద్, తహసీల్దార్ రాజు, ఎంపీడీఓ పవన్ కుమార్ పాల్గొన్నారు.

అమ్రాబాద్: క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ప్రభుత్వవిప్ గువ్వల బాలరాజు అన్నారు. రెండు రోజులుగా మండలంలోని కుమ్మరోనిపల్లి నిర్వహిస్తున్న క్రీడా పోటీలను బుధవారం ఆయన సందర్శించి క్రీడాకారులతో మాట్లాడారు. బుధవారం నిర్వహించిన పోటీలలో మ్యాన్‌ఆఫ్‌ద మ్యాచ్ బహుమతిని క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో పదర జెడ్పీటీసీ రాంబాబునాయక్, నాయకులు ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కందనూలు: పట్టణంలోని రాంనగర్ సీతారామ స్వామి దేవస్థానం, హౌసింగ్ బోర్డు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, టీచర్స్ కాలనీలో వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం ధనుర్మాసం పూజలో భాగంగా గోదాదేవి మాతకు 27వ రోజున ప్రత్యేకంగా తయారుచేసిన కూడారై ప్రసాదాన్ని నివేదించారు. రామాలయ ప్రధాన అర్చకుడు వరదరాజన్ మాట్లాడుతూ.. ఈనెల 16న గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని వనితా క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు.

బ్యాంకు నిర్వహణపై అవగాహన



ఉప్పునుంతల: స్థానిక బాలల ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థుల చేత చిల్డ్రన్ బ్యాంకు నిర్వహించి అవగాహన కల్పించారు. బ్యాంకు ఖాతా నిర్వహణ, డబ్బు జమ, విత్ డ్రా వంటి నమూనా కార్యక్రమాలు నిర్వహించారు. బ్యాంకు మేనేజర్ భార్గవి, ఫీల్డ్ అధికారిగా గౌతమ్, పోలీస్ కానిస్టేబుల్‌గా వెంకటేష్ వ్యవహరించారు.

నిద్రావస్థలో నిఘానేత్రాలు



మన్ననూర్ చౌరస్తాలో పని చేయని కెమెరాలు

మన్ననూర్: ప్రజా రక్షణ, భద్రత కోసం పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన నిఘానేత్రాలు నిద్రావస్థలో ఉన్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూర్‌లోని అంబేద్కర్ కూడలి, ఓం చౌరస్తా, వివేకానంద విగ్రహం వద్ద గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొంత కాలంగా పని చేయడం లేదు. దొంగలు, అక్రమాలు, సంఘటనలను సునాయసంగా ఛేదించేందుకు వీలుంటుందనే ఉద్దేశంతో మన్ననూర్‌తో పాటు ఉమ్మడి అమ్రాబాద్ మండలంలో మాచారం, అమ్రాబాద్, పదర, వంకేశ్వరంలో రూ.లక్షలు వెచ్చించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఏర్పాట్లు బాగున్నప్పటికీ సాంకేతిక లోపం కారణంగా కొన్ని నెలలుగా పని చేయడం లేదు. దొంగతనాల నుంచి రక్షణ పొందేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన పోలీసులు పని చేయని వాటికి మరమ్మతు చేయడం మరిచారు. ఇది ఇలా ఉంటే ఈ మధ్య కొన్ని నేర పూరిత సంఘటనలకు సరైన ఆధారాలు దొరక్క అధికారులకు ఇబ్బందులు కలిగిన రోజులు కూడా ఉన్నాయి. పని చేయని సీసీ కెమెరాలను బాగు చేయించి గ్రామాలకు రక్షణ కల్పించాలని పలువురు అంటున్నారు.

టీఎస్‌యూటీఎఫ్ పోస్టర్ విడుదల

కందనూలు: టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు .కృష్ణ, శ్రీధర్ శర్మ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో మహాసభల వాల్ పోస్టర్ ఆవిష్కరించారు.

పెద్దకొత్తపల్లి: ఈ నెల 13, 14 తేదీలలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌శర్మ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మహాసభల వాల్ పోస్టర్లను ఉపాధ్యాయులతో కలిసి విడుదల చేశారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మద్దిలేటి, చంద్రశేఖర్, మహేష్‌బాబు, ఆంజనేయులు, నందీశ్వర్, రాజు, సువర్ణ, శివలింగం పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుధారాణి ఆవిష్కరించారు. చిన్నయ్య, బాలరాజు, ఎల్లయ్యగౌడ్, రామేశ్వరయ్య, ఈశ్వరమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ముగ్గుల పోటీలు



కల్వకుర్తిలో ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న సొసైటీ సభ్యులు



వెల్దండలో..

కల్వకుర్తి: పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ పాఠశాల ఆవరణలో కుబేర పొదుపు సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. బుధవారం సహకార భారతి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మహిళలకు, విద్యార్థులకు సంక్రాంతి క్రీడోత్సవాలు చేపట్టారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పర్వతాలు, పాండురంగారెడ్డి, జనార్దన్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్‌హైస్కూల్‌లో సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. సర్పంచ్ భూపతిరెడ్డి, ప్రిన్సిపాల్ పుష్పలత, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి



గిరిజనులతో మాట్లాడుతున్న రాఘవేందర్‌రెడ్డి

చారకొండ: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో తండాల్లో అభివృద్ధి పనులు చేపడతామని చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని శేరి అప్పారెడ్డిపల్లి పరిధిలోని పడమటితండా, తూర్పుతండా, సోమ్లాతండాలను పర్యటించారు. తండాల్లో అభివృద్ధి, వారి జీవన పరిస్థితులను పరిశీలించారు. తండాల్లో సీసీరోడ్లు, తాగునీటి ప్లాంట్, గుడి నిర్మాణం గురించి చర్చించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో విద్య, వైద్యం, ఉపాధిపై సహాయ సహకారాలు అందించడానికి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో సోమ్లా, సురేష్ తదితరులు ఉన్నారు.

ఐక్యంగా హక్కులను సాధించుకోవాలి



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సంఘం నాయకులు

వెల్దండ: ముదిరాజ్ కులస్తులంత ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని నియోజకవర్గ అధ్యక్షుడు పుట్ట శేఖర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో మండల ముదిరాజ్ సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లేష్, ఉపాధ్యక్షులు రమేష్, గోపాల్, ప్రధాన కార్యదర్శిగా శంకర్, సహాయకార్యదర్శిగా కొండల్, పలువురిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లింగం, వెంకటయ్య, వెంకటేష్, ఎర్రశ్రీను పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కృషి

కల్వకుర్తిరూరల్: సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ముదిరాజ్ మహాసభ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ కోరారు. బుధవారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో జిల్లా తెనుగోళ్ల భవన సాధన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని చెరువులపై ముదిరాజ్ కుటుంబాలకు సంపూర్ణ హక్కు ఉందని ప్రభుత్వ సహకారంతో జిల్లా వ్యాప్తంగా మరిన్ని మత్స్యశాఖ సొసైటీలు ఏర్పరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో హరికృష్ణ, నిరంజన్, బంగారయ్య, ఆంజనేయులు, భీమయ్య, భానుచందర్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

తెలకపల్లి: మండల కేంద్రానికి చెందిన నిరుపేద విద్యార్థి సైపుద్దీన్ కుమారుడు షమీరుద్దీన్ హైదరాబాద్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. చదువులకు ఆదుకోవాలని గతంలో కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని కోరగా గతేడాది రూ.50 వేలు అందించారు. మూడో సంవత్సరం రూ.50 వేల కళాశాల ఫీజును విద్యార్థి తండ్రికి ఎమ్మెల్యే బుధవారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ హనుమంతురావు, ఎంపీపీ మధు, నరేందర్ రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కళకళలాడుతున్న యాసంగి పంటలు



పెద్దకొత్తపల్లిలో వేరుశనగపైరు



మొక్కజొన్నసాగు



మినుముసాగు

పెద్దకొత్తపల్లి: మండలంలో కేఎల్‌ఐ సాగునీరు అందడంతో యాసంగిలో రైతులు సాగుచేసిన పంటలు కళకళలాడుతున్నాయి. 5ఏళ్లుగా సాగునీరు వస్తుండడంతో వేరుశనగ, వరి, మినుము, జొన్న, ఆముదం పంటలను సాగు చేస్తున్నారు. మండలంలో యాసంగిలో రైతులు 21వేల ఎకరాలలో వివిధ రకాల పంటలను వేశారు. వేరుశనగ 5,922 ఎకరాలు, వరి 4వేలు, మినుము 2,530, జొన్న 33, ఆముదం 30 ఎకరాలలో సాగు చేశారు. దేవల్‌తిరుమలాపూర్, పెద్దకొత్తపల్లి, వెనచర్ల, సాతాపూర్, కల్వకోల్, పెద్దకార్పాముల, ముష్టిపల్లి, మత్రిపల్లిలో వరి పంట, చంద్రకల్, ఆదిరాల, బాచారం, చిన్నకార్పాముల, యాపట్లలో వేరుశనగ సాగును ఎక్కువగా చేపట్టారు.

అదుపు తప్పితే అంతే..

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలో కలిపే లింకు రోడ్లు భారీ వర్షాలకు మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారాయి. పేరుకే ఆర్‌అండ్‌బీ రోడ్లు అయినప్పటికీ ఎటువంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్ల వెంట ప్రయాణం ఆందోళనకరంగా మారిందని ప్రజలు అంటున్నారు. మండలంలోని అంతారం, సాగుదేవ్‌పల్లి, ఐతోల్‌కు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గోవిందాయిపల్లి సమీపాన రోడ్డు అంచుకు మట్టి కొట్టుకుపోయింది. అధికారులు రోడ్లు పరిశీలించి తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గోవిందాయిపల్లి వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత